www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్
10 అక్టోబర్ 2023
సంపుటి : 1, సంచిక: 357

# విశాల భారతి
తెలుగు దినపత్రిక



# పాలకుర్తి నుంచి దయాకర్‌రావు సదురుకోవాల్సిందే..

- ఎన్ని ఎత్తులు వేసినా వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదు
- నీచ రాజకీయాలతో కాంగ్రెస్ కార్యకర్తలను బెదిరిస్తుండు
- ప్రలోభపెట్టి పలువురిని పార్టీలో చేర్చుకోవడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి ఇన్ చార్జి ఝాన్సీరెడ్డి

**పాలకుర్తి, విశాల భారతి:** కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలను బెదిరిస్తూ, ప్రలోభాలకు గురిచేస్తూ బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుంటూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, నీచమైన నైతికత లేని రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్ చార్జి ఝాన్సీరెడ్డి ఫైర్ అయ్యారు. 'ఎర్రబెల్లి' ఎన్ని దిక్కుమాలిన వేశాలు వేసినా.. ఓటమి తప్పదని, ఆయన ఇక పాలకుర్తి నుంచి మూట, ముల్లె సదురుకోవాల్సిందేనని హెచ్చరించారు. పలువురు కాంగ్రెస్ కార్యకర్తలను, నాయకులను బెదిరించి , ప్రలోభపెట్టి బీఆర్ఎస్‌పార్టీలో చేర్చుకోవడం సిగ్గు చేటు అన్నారు. నైతికత లేని రాజకీయాలకు పాల్పడుతున్న ఎర్రబెల్లి ని ఓడించి తీరుతానని ఝాన్సీ రెడ్డి స్పష్టం చేశారు. కొడకండ్ల మండలం మైదం చెరువు, గిర్ని తండా, బాలు నాయక్ తండా, పెంకుల తండా గ్రామాల్లో సోమవారం 3వ రోజు 'గడప గడపకు కాంగ్రెస్- పల్లె పల్లెకు ఝాన్సమ్మ' కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మిగతా 2లో

## పోటీ చేసే అవకాశం ఇస్తారన్న నమ్మకం ఉంది

### స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య
### రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరణ



**హైదరాబాద్,విశాలభారతి:** త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అధిష్ఠానం తనకు సీటు కేటాయిస్తుందన్న విశ్వాసం ఇంకా ఉందని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ఎప్పటికప్పుడు సర్వే నివేదికలు తెప్పించుకుంటూ పరిశీలిస్తు బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు టికెట్ ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని నాంపల్లిలో తెలంగాణ రైతుబంధు సమితి కార్యాలయంలో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా, స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన సీఎం తనకు అప్పగించిన ఈ అదనపు బాధ్యతల ద్వారా రైతులకు సేవ చేస్తానని రాజయ్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ఉన్న రైతుబంధు సమితి సభ్యుల సేవలు మరింత విస్తృతం చేసి రాబోయే రోజుల్లో అన్నదాతకు చేరువై అన్నిరకాల సమస్యల పరిష్కారానికి మిగతా 2లో

# బాస్ ఈజ్ బ్యాక్

- 15 నుంచి రంగంలోకి కేసీఆర్
- అదే రోజు హుస్నాబాద్‌లో భారీబహిరంగసభ
- వరుసగా పర్యటనలు

**హైదరాబాద్,విశాలభారతి:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగడంతో అధికార భారాస వేగంగా వ్యూహాలు రచిస్తోంది. భారాస అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్.. అక్టోబర్ 15 నుంచి ఎన్నికల ప్రచారంలోకి దిగనున్నారు. ఇప్పటికే ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థులతో ఈ నెల 15న తెలంగాణ భవన్‌లో సమావేశం కానున్నారు. అభ్యర్థులకు బీఫామ్‌లు అందజేసి నామినేషన్‌లు వేసే సమయంలో జాగ్రత్తలు, ఎన్నికల నియామవళి, ప్రచార వ్యూహాలను వివరించనున్నారు. అదే సమయంలో అభ్యర్థుల సమక్షంలో భారాస మేనిఫెస్టోను కేసీఆర్ విడుదల మిగతా 2లో

## కామ్రేడ్స్‌తో కాంగ్రెస్‌కు కుదిరిన పొత్తు

### సీపీఎం, సీపీఐకి చెరో రెండు సీట్లు

**విశాలభారతి, హైదరాబాద్:** తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తోనే కమ్యూనిస్టులు నడిచేందుకు సిద్ధమయ్యారు. సోమవారం నాడు కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎర్రపార్టీలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. సీపీఐ, సీపీఎం పార్టీలకు చెరో రెండు సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. మొదటగా రెండు పార్టీలకు చెరొక సీటు ప్రతిపాదనను కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది. అయితే కమ్యూనిస్టులు ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. దీంతో చెరో రెండు



స్థానాల్లో టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. సీపీఐకి కొత్తగూడెం, మునుగోడు నియోజకవర్గాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. సీపీఎంకు భద్రాచలం, మిగతా 2లో

మేకిన్ ఇండియా ఉత్త డొల్ల! 2లో

నేడు తెలంగాణకు అమిత్ షా!! 2లో

నవంబర్ 9న సీఎం కేసీఆర్ నామినేషన్ 2లో



- ఎన్నికల షెడ్యూల్ రిలీజ్
- నవంబర్ 30న తెలంగాణ పోలింగ్
- డిసెంబర్ 3న ఫలితాలు
- తక్షణం అమల్లోకి కోడ్
- ఐదు రాష్ట్రాల ఎన్నికలకు తేదీలు ఖరారు

### పోలింగ్ తేదీలు ఇలా..

మధ్యప్రదేశ్: నవంబర్ 17
రాజస్థాన్: నవంబర్ 23
ఛత్తీస్‌గఢ్ (రెండు విడతల్లో) : నవంబర్ 7, 17
తెలంగాణ: నవంబర్ 30
మిజోరం: నవంబర్ 7
ఫలితాల ప్రకటన : డిసెంబర్ 3

# నగారా మోగింది

**విశాలభారతి, ఢిల్లీ:** ఎన్నికల నగారా మోగింది. ఐదు రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30 న పోలింగ్ జరగనున్నది. డిసెంబర్ 3న ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ మేరకు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈసీ చీఫ్ రాజీవ్ కుమార్ అధికారికంగా ఈ తేదీల్ని ప్రకటించారు. మిజోరంలో నవంబర్ 7న ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ 3న కౌంటింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. ఛత్తీస్‌గఢ్‌లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. మధ్యప్రదేశ్‌లో నవంబర్ 7న ఎన్నికలు నిర్వహించనున్నారు. మధ్యప్రదేశ్‌లో ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలో నవంబర్ 30న ఎన్నికలు జరగనున్నాయి. రాజస్థాన్‌లో నవంబర్ 23న ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ 3వ తేదీనే ఫలితాలు వెల్లడించనున్నారు. డిసెంబర్ 5 తో మొత్తం 5 రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ఈ తేదీల ప్రకటనతో 5 రాష్ట్రాల్లోనూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. యువ ఓటర్ల నమోదుపై ఎక్కువగా దృష్టి సారించినట్టు రాజీవ్ కుమార్ వెల్లడించారు. దివ్యాంగులకూ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ప్రత్యేక అవసరాలున్న వ్యక్తులు ఇంట్లో నుంచే ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్టు స్పష్టం చేశారు. 5 రాష్ట్రాల్లో మొత్తం 679 అసెంబ్లీ స్థానాలున్నట్టు తెలిపారు. ఈ 5 రాష్ట్రాల్లో 40 రోజుల పాటు పర్యటించామని తెలిపారు సీఈసీ రాజీవ్ కుమార్. ఈ 5 రాష్ట్రాల్లో మొత్తం 16.14 కోట్ల మంది ఓటర్లుండగా..వీరిలో 60 లక్షల మంది కొత్త ఓటర్లున్నారని చెప్పారు. పార్టీలు, ప్రభుత్వాధికారులతో చర్చించినట్టు వివరించారు. అన్ని రాష్ట్రాల్లోనూ మహిళా ఓటర్ల సంఖ్య పెరిగినట్టు తెలిపారు. తెలంగాణలో 3.17కోట్ల మంది ఓటర్లున్నట్టు వెల్లడించారు. రాజస్థాన్‌లో 5.25 కోట్ల మంది ఓటర్లున్నారని వెల్లడించారు. తెలంగాణలో ప్రతి 897 మందికి ఓ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు స్పష్టం చేశారు. మిజోరంలో 8.52 లక్షల మంది ఓటర్లున్నారు.

### తెలంగాణ ఎన్నికల షెడ్యూల్ ఇదే

| | |
|---|---|
| పోలింగ్ తేదీ: | 30 నవంబర్ 2023 |
| కౌంటింగ్ తేదీ: | 3 డిసెంబర్ 2023 |
| తెలంగాణలో ఎన్నికల నోటిఫికేషన్: | 3 నవంబర్ 2023 |
| ఎన్నికల నామినేషన్ల స్వీకరణ తేదీ: | 3 నవంబర్ 2023 |
| ఎన్నికల నామినేషన్లకు తుది గడువు : | 10 నవంబర్ 2023 |
| నామినేషన్ల స్క్రూట్నీ తేదీ: | 13 నవంబర్ 2023 |
| నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరు తేదీ: | 15 నవంబర్ 2023 |

## దయాకర్‌రావును మరోసారి గెలిపించండి



- కేసీఆర్ ఆశీస్సులతో అద్భుతంగా పని చేసిండు
- ఆయనకు ఈ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీ ఖాయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

**తొర్రూర్, విశాల భారతి:** ఆపతి సాపతిలో ఆదుకునే పరకాల ఎమ్మెల్యే, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును మళ్లోసారి గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మున్సిపల్‌శాఖా మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరులో పాలకుర్తి నియోజకవర్గ ప్రగతి నివేదన సభకు కేటీఆర్‌ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మంత్రి ఎర్రబెల్లిని పొగడ్తలతో ముంచెత్తారు. నివేదన సభకు వచ్చిన జనాన్ని చూస్తే దయాకర్ రావు విజయం ఖాయమైందన్నారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో రాష్ట్ర మంత్రిగాఅద్భుతంగా పని చేశారని కితాబిచ్చారు. మంత్రి ఎర్రబెల్లి కి ఇచ్చిన శాఖను బాగా పని చేయించి అనేక అవార్డులను తెచ్చిండు అన్నారు. ఇప్పటికే దయాకర్ రావు కి లక్ష ఓట్ల మెజారిటీ ఖాయమని అర్థమైపోయిందని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ జెండా ఎగురవేస్తాం

- అవినీతి పాలన పోవాలంటే బీజేపీతోనే సాధ్యం
- డబ్బులు, అధికారం దుర్వినియోగం లేని ఎన్నికలు ప్రజలు కోరుకుంటున్నారు
- ఎన్నికలకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

**హైదరాబాద్,విశాలభారతి:** తెలంగాణ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవినీతి పాలన పోవాలంటే కేవలం అది బీజేపీతోనే సాధ్యం అవుతుందని తెలిపారు. డబ్బులు, అధికారం దుర్వినియోగం లేని ఎన్నికలు ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో జరగబోయే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చి జెండా ఎగురవేస్తాం కిషన్రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో అవినీతి, కుటుంబ పాలన పోవాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ మార్పు కేవలం బీజేపీతో వస్తుంది అని కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికలకు బీజేపీ పూర్తి సిద్ధంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా కమిటీలు సమావేశాలు జరిపి ప్రచారానికి సంబంధించిన అంశాలను నిర్ణయిస్తారు. నేతలంతా ఐకమత్యంగా పోరాడి ఎన్నికల్లో విజయ ఢంకా మోగిస్తామన్నారు. రాష్ట్రంలో అవినీతి, కుటుంబపాలనను తుడిచిపెట్టాలని ప్రధాని చెప్పారన్నారు. రెండు, మూడు స్థానాల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ పడాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఈ రెండు పార్టీలని ఆదరించవద్దని ప్రజలకు విన్నవించారు. ఉద్యమ ద్రోహులందరు ప్రగతిభవన్లో చేరిపోయారని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజలు బీజేపీ ఆశీర్వదించారని కోరారు. అధికారాన్ని, డబ్బును ఉపయోగించి కేసీఆర్ ఎన్నికలకు వెళ్తున్నారని కిషన్రెడ్డి ఆరోపించారు. సకలజనుల పాలన తెలంగాణలో రావాలన్న ఆయన...బీజేపీతోనే సకలజనుల పాలన సాధ్యం అని తెలిపారు. డబ్బు, అధికార దుర్వినియోగం లేకుండా ఎన్నికలు జరగాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎన్నికల ప్రకటన తర్వాత మొట్టమొదటి సభ మంగళవారం ఆదిలాబాద్లో జరగనుంది. ఆదిలాబాద్లో జరగబోయే సభలో అమిత్షా ప్రసంగిస్తారు. సాయంత్రం ఇంపీరియల్ గార్డెన్స్లో మేధావులతో అమిత్షా సమావేశం అవుతారని తెలిపారు. సమ్మక్క సారక్క ఆశీస్సుల కోసం ముఖ్య నేతలంతా ములుగు వెళుతున్నాం అని తెలిపారు. తెలంగాణలో ప్రకటించిన ఎన్నికల నోటిఫికేషన్ను బీజేపీ పార్టీ స్వాగతం పలుకుతోంది. మా పార్టీ ఎన్నికలకు పూర్తి సిద్ధంగా ఉంది. తెలంగాణ ప్రజలు మార్పు పరివర్తన కోరుకుంటున్నారు. తెలంగాణలో అధికారంలోకి రావడం కోసం బీజేపీ పార్టీ



నాయకులు శక్తిని కేంద్రీకరించి ఐక్యమత్యంగా పని చేసి రాష్ట్రంలో జెండాను ఎగురవేస్తాం. తెలంగాణలో కోరుకుంటున్న మార్పు బీజేపీతోనే సాధ్యం అవుతుంది. ఇక్కడ ఉన్న అవినీతి, కుటుంబపాలన పోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. మోదీ కూడా ఇదే కోరుకుంటున్నారు అని కిషన్రెడ్డి అన్నారు. కేసీఆర్ ఎన్నికలను డబ్బుమయం చేశారని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. ఒక్కో నియోజకవర్గానికి రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు ఖర్చు పెట్టాలని కేసీఆర్ నిర్ణయించారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలను అంగట్లో సరుకులా అమ్ముతున్నారని తెలిపారు. బీఆర్ఎస్కు ఓటేస్తేనే దళితబంధు, పింఛన్ వస్తుందని ప్రజలను భయపెడుతున్నారని మండిపడ్డారు. బీజేపీకి ఓటేస్తే పథకాలన్నీ పోతాయని ప్రజలను భయపెడుతున్నారని తెలిపిన ఆయన మా పార్టీ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని అన్నారు. హుజూరాబాద్లో కేసీఆర్ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకాలేదని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు.

# పాలకుర్తి నుంచి దయాకర్‌రావు సదురుకోవాల్సిందే..

**మొదటి పేజీ తరువాయి**

ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో మహిళలు కోలాట ఆటపాటలు, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వస్తే మన నీళ్లు, నిధులు, ఉద్యోగాలు మనకి వస్తాయనుకుంటే, కేసీఆర్ కుటుంబంలోనే ఉద్యోగాలు వచ్చాయి కానీ, ఏ ఒక్క నిరుద్యోగికి కూడా ఉద్యోగం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'డబ్బా ఇండ్లు వద్దు.. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ముద్దు' అన్న మాటలమారి కేసీఆర్ తొమ్మిదేండ్లలో పాలకుర్తిలో ఏ ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణలో తొలి ముఖ్యమంత్రిని దళితున్ని చేస్తానని చేయకుండా, దళితులని మోసం చేసిన చరిత్ర కేసీఆర్ ది కాదా అని ప్రశ్నించారు.

పాలకుర్తి ఎమ్మెల్యేగా, పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉండి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేసింది ఏమీ లేదని కనీసం పాలకుర్తి కేంద్రంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయలేదని కమిషన్ దండుకోవడం తప్ప ఆయనకు వేరే ధ్యాస లేదన్నారు. తెలంగాణ ఇచ్చిన తల్లిగా సోనియాగాంధీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపు అమలు చేస్తామని అన్నారు. ఎర్రబెల్లి, బీఆర్ఎస్ లీడర్ల బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరూ భయపడరని పార్టీ శ్రేణులు అధైర్యపడవద్దని అండగా నేనుంటానని భరోసా ఇచ్చారు. తాను ఏదైనా పని మొదలు పెడితే .. అది ఎన్ని కష్టాలు, ఒడిదొడుకులు వచ్చినా.. విజయం సాధించేదాక విశ్రమించని ఝాన్సీరెడ్డి స్పష్టం చేశారు. దయాకర్‌రావు నియోజక వర్గంలో 15 ఏండ్లుగా నియంత పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.

ప్రభుత్వ సంకుచిత ఆలోచనలో భాగంగా ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్ తో రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని ఒకరి భూమి ఒకరిపై పట్టాలు కావడం, రికార్డులు, పాస్‌బుక్‌లు తారుమారు కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని ఝాన్సీరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త ఒక సైనికుడి వలె పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధరావత్ సురేశ్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షుడు సుధీర్ నాయక్, సిద్ధు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హెమని నాయక్, హరి చందర్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు భాస్కర్, రవి, యూత్ కాంగ్రెస్ నాయకులు గోపాల్, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు హర గోపాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పోటీ చేసే అవకాశం ఇస్తారన్న నమ్మకం ఉంది

**మొదటి పేజీ తరువాయి**

తమవంతు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహిస్తున్నా. అదనంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నన్ను రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు ఇచ్చారు. ఇలా రైతులకు సేవ చేస్తాను. ఎమ్మెల్యే అభ్యర్థులు మారే అవకాశం ఉందని అన్నారు. సీఎం కేసీఆర్ రోజు సర్వే రిపోర్టులు చూస్తున్నారు. క్షేత్రస్థాయిలో సర్వేలు చేయిస్తున్నారు. నాకు టికెట్ ఇస్తారని ఇంకా నమ్మకం ఉంది అని తాటికొండ రాజయ్య అన్నారు. కాగా ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించింది. స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే టికెట్ కోసం కడియం శ్రీహరి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మధ్య చాలా కాలంగా పోటీ సాగింది. ఈ నేతలిద్దరు బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ కడియం శ్రీహరికి ఇవ్వడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య అసంతృప్తి చెందారు. మరోసారి ఎమ్మెల్యే టికెట్ తనకే ఇస్తారన్నా ధీమాతో ఉన్న రాజయ్యకు.. అధిష్టానం నిర్ణయం పెద్ద షాక్కే గురిచేసింది. ఆయనను సంతృప్తి పరిచేందుకు రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షునిగా నియమించింది.

# బాస్ ఈజ్ బ్యాక్

**మొదటి పేజీ తరువాయి**

చేయనున్నారు. ఇందులో ఆసరా పింఛన్‌లు, రైతుబంధు సాయం పెంపు వంటి రైతు, మహిళ, బీసీ, మైనారిటీలు, యువతను ఆకర్షించేలా పలు హామీలు ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**గతంలో మాదిరే హుస్నాబాద్ నుంచే..**

ఆ తర్వాత సుమారు వంద నియోజకవర్గాల్లో పర్యటించేలా ప్రణాళిక చేసిన కేసీఆర్.. ఈ నెల 15నే నియోజకవర్గాల్లో బహిరంగ సభలకు శ్రీకారం చుట్టనున్నారు. గత ఎన్నికల మాదిరిగా హుస్నాబాద్ నుంచే ఈసారి కూడా ఎన్నికల ప్రచారం ప్రారంభించేలా ప్రణాళిక చేశారు. తెలంగాణ భవన్‌లో సమావేశం ముగియగానే.. హైదరాబాద్ నుంచి నేరుగా హుస్నాబాద్‌కు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ నెల 16న జనగామ, భువనగిరిలో.. 17న సిద్దిపేట, సిరిసిల్లలో కేసీఆర్ సభలు నిర్వహిస్తారు. ఈ నెల 18న మధ్యాహ్నం 2 గంటలకు జడ్చర్లలో.. సాయంత్రం 4 గంటలకు మేడ్చల్ బహిరంగ సభల్లో గులాబీ దళపతి ప్రచారం నిర్వహిస్తారు.

**సెంటిమెంట్ ప్రకారం కోనాయపల్లిలో పూజలు**

ఈసారి కామారెడ్డి, గజ్వేల్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించిన సీఎం కేసీఆర్.. నవంబరు 9న నామినేషన్లు వేయనున్నారు. నవంబరు 9న తన సెంటిమెంట్ ప్రకారం కోనాయపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి గజ్వేల్‌లో నామినేషన్ వేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కామారెడ్డిలో కూడా నామినేషన్ దాఖలు చేసి.. అనంతరం అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

# కామ్రేడ్స్‌తో కాంగ్రెస్‌కు కుదిరిన పొత్తు

**మొదటి పేజీ తరువాయి**

మిర్యాలగూడ ఇవ్వాలని అనుకుంటోంది. భద్రాచలం నియోజకవర్గంలో ఇప్పటికే అక్కడ కాంగ్రెస్‌కు సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ సీపీఎంకి ఇవ్వాలని స్క్రీనింగ్ కమిటీలో నిర్ణయం తీసుకుంది. భద్రాచలం సిట్టింగ్ ఎమ్మెల్యే పోడెం వీరయ్యను పినపాక నియోజకవర్గానికి పంపాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. పాలేరు, ఖమ్మం నుంచి టికెట్లు కావాలని కమ్యూనిస్టులు పట్టుబట్టారు. కానీ అక్కడ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాలేరు నుంచి పోటీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పాలేరు నియోజకవర్గంలో ప్రచారాన్ని సైతం ముమ్మరంగా చేస్తున్నారు. ఖమ్మం నుంచి తుమ్మల నాగేశ్వరరావు బరిలో నిలవనున్నారు. దీంతో కమ్యూనిస్టులకు కాంగ్రెస్ పార్టీ అక్కడి నుంచి టికెట్లు ఇచ్చేందుకు నిరాకరించింది.

# ప్రజాశాంతి పార్టీ పోటీ చేస్తుంది

## కేఏ పాల్



**విశాలభారతి స్టేట్ బ్యూరో:** తెలంగాణలో ప్రజాశాంతి పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ తెలిపారు. సోమవారం నాడు విశాఖపట్నంలో అయన పర్యటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయింది. తెలంగాణ ఎన్నికలో మా పార్టీ నుంచి 119 మంది అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని అన్నారు. కులమతాలకు అతీతంగా ఎన్నికల్లో గెలిచి అభివృద్ధి చేస్తాను. నేను దేశం, మన తెలుగు రాష్ట్రాలను కాపాడుకుంటున్నాను. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి రూపాల స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటు పరం చేయకుండా ఆపేశారనీ పేర్కొన్నారు. ఏపీలో బీజేపీ పార్టీ లేదు. ఇజ్రాయెల్, పాలస్తీనల గొడవలు ఆగిపోవలని దేవుడికి ప్రార్థన చేశా. శాంతి కోసం మీరందరు కూడా ప్రార్థన చేయాలి. డిసెంబర్10 తేదీన ప్రపంచ గ్లోబల్ క్రిస్మస్ వేడుకలు చేస్తున్నాం. గ్లోబల్ క్రిస్మస్ వేడుకలకు 5 వేల మందిని ఆహ్వానిస్తున్నామని చెప్పారు.డిసెంబర్ 10వ తేదీన ఇక్కడ నుంచే 200 దేశాలకి శాంతి సందేశం ఇస్తాను" అని కేఏ పాల్ పేర్కొన్నారు.



# నేడు తెలంగాణకు అమిత్ షా!!

**హైదరాబాద్,విశాలభారతి:** కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరోసారి తెలంగాణకు రానున్నారు. నేడు అమిత్ షా రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి అధికారిక షెడ్యూల్ ఖరారైంది. మధ్యాహ్నం ఆదిలాబాద్‌లోని డైట్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగసభలో అమిత్ షా పాల్గొనున్నారు. ఇప్పటికే ఈ నెల 1న మహబూబ్‌నగర్, 3న నిజామాబాద్‌లో నిర్వహించిన సభల ద్వారా రాష్ట్రంలో పార్టీపరంగా ప్రధాని మోదీ ఎన్నికల శంఖాన్ని పూరించిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా అమిత్ షా సభను బీజేపీ నిర్వహించనుంది.

అమిత్ షా షెడ్యూల్:
మధ్యాహ్నం 1.45 కు బేగంపేట ఎయిర్ పోర్ట్‌కు అమిత్ షా
2.35కు ప్రత్యేక హెలికాప్టర్ లో ఆదిలాబాద్ చేరుకుంటారు.
మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఆదిలాబాద్ సభలో పాల్గొననున్నారు.
4.15 కు ఆదిలాబాద్ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు బయలుదేరనున్నారు.
5.05 బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.
5. 20 నుంచి 6 గంటల ఐటీసీ కాకతీయలో సమావేశం
6 గంటలకు ఇంపీరియల్ గార్డెన్‌కుబయల్దేరనున్నారు.
6.20 నుంచి 7.20 వరకు ఈ భేటీ కొనసాగనుంది.

# హెల్దీ హార్ట్‌హెల్దీ సిద్ధిపేట

**సెల్ఫ్ ఆటోమేటిక్ బీపీ చెకప్ మిషన్ కేంద్రం ఏర్పాటు • వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు**

**హైదరాబాద్, విశాలభారతి:** "హెల్దీ హార్ట్‌హెల్దీ సిద్ధిపేట" పేరిట మన ఆరోగ్యం కాపాడుకోవడం మన చేతుల్లోనే.. ఉందని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో పట్టణంలో సెల్ఫ్ ఆటోమేటిక్ బీపీ చెకప్ మిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు చెప్పారు. సిద్ధిపేటలో పర్యటించిన మంత్రి ఇర్కోడ్ గ్రామంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ను ప్రారంభించారు. అనంతరం 24 మంది డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. సిద్ధిపేటలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మొత్తం ఆరు చోట్ల బీపీ చెకప్ మిషన్ కేంద్రాల్ని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. చాలా మంది ప్రజలు తాము బీపీతో బాధ పడుతున్నట్లు తెలియక సడన్ కార్డియాటిక్ స్ట్రోక్ వచ్చి ఆకస్మికంగా మృత్యువాత పడుతున్నారని, రక్తపోటు (బీపీ) పరీక్ష చేయడంతో మీ ఆరోగ్యాన్ని, మీరే పరిరక్షించుకోవచ్చని, దీన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు మంత్రి సూచించారు. పట్టణంలోని మోడ్రన్ బస్టాండులో మంత్రి, జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ కలిసి బీపీ చెకప్ మిషన్ను ప్రారంభించారు.







# నవంబర్ 9న సీఎం కేసీఆర్ నామినేషన్

## గజ్వేల్ సెగ్మెంట్‌తో పాటు కామారెడ్డి నుంచి పోటీ



**హైదరాబాద్,విశాలభారతి:** తెలంగాణ సీఎం కేసీఆర్ నామినేషన్ వేసేందుకు ముహూర్తం ఖరారు అయింది. వచ్చే ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గమైన గజ్వేల్ సెగ్మెంట్‌తో పాటు కామారెడ్డి నుంచి పోటీ చేయాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. ఆ రెండు నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలోకి దిగేందుకు కేసీఆర్ నామినేషన్ వేసేందుకు మంచి ముహూర్తం ఖరారు చేసుకున్నారు. నవంబర్ 9న ఆ రెండు నియోజకవర్గాల నుంచి కేసీఆర్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. తాను సెంటిమెంట్ ఆలయంగా నమ్మే కోనాయపల్లి వెంకటేశ్వరస్వారి ఆలయంలో పూజల అనంతరం కేసీఆర్ నామినేషన్ వేయనున్నారు.15వ తేదీనే కేసీఆర్ బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదల చేయనున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల హామీలకు పోటీగా ప్రజలను ఆకట్టుకునేలా బీఆర్ఎస్ పలు కీలక హామీలు ఇవ్వనుందని తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై కసరత్తు జరుగుతోంది. మహిళా ఓటర్లను ఆకట్టుకునేలా అద్భుతమైన పథకాలు ఉంటాయని ఇటీవల బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై మంత్రి హరీష్ రావు హింట్ ఇచ్చారు. మహిళలకు త్వరలోనే గుడ్ న్యూస్ అందుతుందని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలను బట్టి చూస్తే బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కీలక హామీలు ఉంటాయని స్పష్టమవుతుంది. మరోవైపు ఇప్పటినుంచే బీఆర్ఎస్ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసింది. కేసీఆర్ వైరల్ ఫీవర్ వల్ల ప్రగతిభవన్‌కే పరిమితమవ్వగా.. మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.

# మేకిన్ ఇండియా ఉత్త డొల్ల!

భారతదేశానికి కేంద్ర బ్యాంకైన భారతీయ రిజర్వ్ బ్యాంకు 2022- 23 తాజా నివేదికలో దేశంలోని ప్రజల్లో నికర ఆర్థిక పొదుపులు దారుణంగా క్షీణించాయని, 1975- 76 తర్వాత ఇంతగా క్షీణించడం ఇదే మొదటిసారని వెల్లడించింది. స్థూల దేశీయ ఉత్పత్తి శాతంలో దేశ 'ప్రజల నికర ఆర్థిక పొదుపులు" చూస్తే 5 శాతం మాత్రమే ఉన్నదని వెల్లడించింది. భారత స్థూల దేశీయ ఉత్పత్తిలో దేశ ప్రజల నికర ఆర్థిక పొదుపులు ఇంతగా క్షీణించడం చాలా విచారకరమని ఆర్థిక వేత్తలు వాపోతున్నారు. ఇది భారతదేశ ప్రభుత్వం అనుసరించిన విధానాల వలనే దేశ ప్రజల దగ్గర పొదుపులు చేసే శక్తి తగ్గిపోవడం, ప్రజల దగ్గర ఆదాయాలు లేకపోవడం అన్నింటికీ కారణం. దేశాన్ని పాలిస్తున్న ప్రభుత్వ విధానాలే రోజు సగటు మనిషికి వచ్చే ఆదాయంలో 'పొట్ట, బట్ట' కు మాత్రమే సరిపోతుంది కానీ పొదుపులు చేయడానికి సరిపోతలేవని అర్థమవుతున్నది. దేశంలో పెరుగుతున్న ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేదు. భారత రిజర్వ్ బ్యాంక్ వెల్లడించిన విషయాలు ఆర్థిక వేత్తలనూ సగటు మానవులకు భవిష్యత్‌పై ఆశలు చంపుకొని జీవించడమేనని స్పష్టమవుతోంది. స్వతంత్ర దేశంలో నివాసముండడానికి కావాల్సిన ఇల్లు పై, ప్రస్తుతం ప్రాథమిక అవసరంగా మారిన వాహనాలపై, క్రెడిట్ కార్డులపై, విపరీతంగా అప్పులు చేస్తున్నారని రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. దేశ ప్రజలు వివిధ రకాల అప్పులపై ఆధారపడ్డారని రిపోర్టు ఇచ్చింది. భారతదేశంలో ప్రజలు పొదుపులు చేసే శక్తి లేక పోతున్న ప్రజలు నూటికి తొంబై శాతమని రుజువైంది.

ప్రస్తుతం పాలకులు ప్రచారం చేస్తున్న 'మేకిన్ ఇండియా' ఉత్త డొల్ల అని బయటపడింది. భారతదేశంలో ఎలాంటి అభివృద్ధి లేదు. అభివృద్ధి మొత్తం ఈ దేశంలో కార్పొరేట్ల అభివృద్ధే. నిజానికి భారతదేశం స్వతంత్ర ఆర్థిక విధానాల నిర్ణయాలతో నిలబడింది కాదు. ప్రస్తుతం భారత్ పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల, కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలు బొమ్మగా మారడంతో పాటుగా సామ్రాజ్యవాద దేశాలైన బ్రిటన్, అమెరికా ఆదేశాలకు అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తోంది. ప్రస్తుతం దేశ ప్రజలవని మనం గొప్పగా చెప్పుకుంటున్న సంస్థలు ప్రభుత్వానివి అయినప్పటికీ, అవి ప్రభుత్వ విధానాల ప్రకారం శాతంలో మాత్రమే మిగిలిన శాతం మొత్తం ప్రైవేటు భాగస్వామ్యం. భారత ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' కోట్ల మంది ఖాతాదారులను కలిగి ఉన్నది. కానీ భారతీయ స్టేట్ బ్యాంక్ లో కూడా హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకు వాటాలూ ఈ దేశ కుబేరుడైన గౌతం అదానీ వాటాలు కలిగి ఉన్నది. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ బ్యాంకైన భారతీయ స్టేట్ బ్యాంకు మొన్నటి వరకు ఖాతాదారులకు 'డెబిట్ కార్డులు' మంజూరు చేయలేని స్థితిలో వున్నది. నిన్న మొన్న వచ్చిన భారతీయ 'రూపాయి డెబిట్ కార్డు' కు ముందు ప్రపంచ ప్రజల రక్తం తాగుతున్న అమెరికా 'వీసా మాస్ట్రో' డెబిట్ కార్డులనే ఇప్పటికీ వాడుతున్నారు. భారతీయ స్టేట్ బ్యాంక్ రూపే డెబిట్ కార్డులు వచ్చేవరకు బ్యాంక్ ఖాతాదారులు అమెరికా కార్డులనే ఉపయోగించేవారు. ఇప్పటికీ ఉపయోగిస్తూనే ఉన్నారు. ఈ కార్డులను వివిధ రకాల షాపింగ్ మాల్స్ లలో ఖాతాదారులు ఉపయోగించినప్పుడు మనం కొనుగోలు చేసిన షాపువారికి డబ్బులు వెంటనే చెల్లింపులు కావు కానీ మన అకౌంట్ నుంచి డబ్బులు కట్ అవుతాయి. డెబిట్ కార్డుల ఓనర్స్ అంటే అమెరికా ఒక్క రోజు రెండు రోజుల తరువాత షాపింగ్ మాల్స్ వారి అకౌంట్లలో డబ్బులు వేస్తారు. ఇలా ఈ వ్యవహారాలు నిర్వహించినందుకు వారు కొంత మొత్తంలో డబ్బులు వసూలు చేసుకుంటారు.ఈ కార్యకలాపాలు మొత్తం వారు అమెరికాలోని కాలిఫోర్నియా నగరంలో ఉంటూ నిర్వహిస్తారు. ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారుల పూర్తి వివరాలు మాస్ట్రో, వీసా డెబిట్ కార్డులను మెయిన్ టెయిన్ చేసే సంస్థల చేతుల్లో ఉంటాయి. అంటే భారత దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ భారతీయ బ్యాంకు ఖాతాదారుల వివరాలు అమెరికా సంస్థ చేతుల్లో ఉన్నాయి. మనకు భారతీయ స్టేట్ బ్యాంకు జారీ చేసే రూపే డెబిట్ కార్డులు వచ్చినప్పటికీ ఈ వ్యవహారం ఇంకా కొనసాగుతూనే ఉన్నది.

భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల విధానం కోసం వాడుతున్న 'ఫోన్ పే' 2016లో బెంగళూరులోని ప్రైవేట్ వ్యక్తులు తయారు చేసిన ఒక యాప్. 2021- 22 లో రూ.1646 కోట్ల ఆదాయం వచ్చిందని ప్రకటించింది. భారత దేశంలో ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న ఫోన్ పే ను 46 కోట్ల మంది ఉపయోగిస్తున్నారు. ఇక మరో డిజిటల్ లావాదేవీలకు ఉపయోగించే గూగుల్ పే కూడా అమెరికా వాళ్లే నిర్వహిస్తున్నారు. ఇక వివిధ రకాల సమాచారం తెలియజేయడానికి వచ్చిన వాట్సాప్ మన దేశంలోకి 2009లో ప్రవేశించింది. దీనిని 2014లో ఫేస్‌బుక్‌అనే సంస్థ 1.18 లక్షల కోట్లు పెట్టి కొనుగోలు చేశారు అంటే తెలంగాణలోని ఒక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడానికి అయిన ఖర్చు. ప్రజలు ప్రతిరోజు వాడుకునే చిన్న యాప్‌ల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం లభిస్తుంది. ఫేస్‌బుక్‌ను కనుగొన్న జుకర్ బర్గ్ ఈరోజు ప్రపంచ కుబేరులలో ఒకరుగా మారారు. భారత ప్రభుత్వం వీటిలో ఒక్కదాన్ని కూడా బ్యాన్ చేసే శక్తి లేదు. భారత ప్రభుత్వం 'వాట్సప్' ను బ్యాన్ చేస్తే ఇండియాలో టెలిగ్రామ్ ను ఇక్కడ ప్రజలు ఉపయోగించుకుంటారు. తద్వారా ఇక్కడ ప్రజల పైసలు అమెరికా దగ్గరికి వెళ్లకుండా ఈ దేశంలోనే ఉపయోగపడతాయి. సామ్రాజ్యవాద దేశాల 'యాప్' లను రద్దు చేసి మన దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో భారత ప్రభుత్వం రకరకాల సాంకేతిక పరిజ్ఞానాన్ని సృష్టించవలసిన అవసరం నేడు ఎంతో ఉన్నది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్‌లో డాలర్లతో రూపాయల విలువ నిరంతరం క్షీణిస్తూ నేటికి ఎనభై రూపాయలకు చేరుకుంది. ఇవన్నీ కూడా భారతదేశ ప్రజలు పేదరికంతో జీవితం గడుపుతున్నరనే విషయాన్ని తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం మనం జీవిస్తున్న భారతదేశం దేశ స్థూల దేశీయ ఉత్పత్తిలో దేశీయ ప్రజల నికర ఆర్థిక పొదుపులు 5శాతంగా ఉన్న దేశంలో ఉన్నాం. మేకిన్‌ఇండియా అంటూ నూటికి ఎనభై శాతం సరుకులు చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. 'ఆజాదీకా అమృత్ మహోత్సవాలు' జరుపుకుంటున్న భారతదేశంలో భారత ప్రజల ఆర్థిక స్థితులు ఇలా ఉండడం ప్రతి ఒక్క భారతీయుడు ఆలోచించాల్సిన విషయం.

– గుండమల్ల సత్యనారాయణ,
రాజకీయ విశ్లేషకులు, కాలమిస్ట్
9505998838

